ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

- జాతీయ రహదారిపైనే ఆయిల్, గ్యాస్ లారీల పార్కింగ్
- ట్రాఫిక్ సమస్యతో నిత్యం ప్రమాదాలు
- పోలీసులను సైతం లెక్కచేయని కంపెనీల అధికారులు
- ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజల భయాందోళన





కట్టుబడిపాలెం వద్ద బైక్‌ను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్ (ఫైల్) ; ఎన్టీఆర్ కాలనీ వద్ద జాతీయ రహదారి మార్జిన్‌లో బీపీసీఎల్ సిబ్బంది పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

జి.కొండూరు: జాతీయ రహదారి మార్జిన్‌లనే పార్కింగ్ స్థలంగా వందలాది ఆయిల్, గ్యాస్ లారీలను నిలుపుతున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌లు, యూటర్న్‌లతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు మృత్యువాతపడుతున్నారు. కొందరైతే క్షతగాత్రులుగా మారి నరకయాతన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వ అధీనంలో నిర్వహిస్తున్న ఆయిల్, గ్యాస్ కంపెనీల అధికారుల తీరులో మార్పు రావడంలేదు. పోలీసులు హెచ్చరికలను లెక్క చేయరు. లారీల యజమానులు, డ్రైవర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పులేదు. పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయరు. విజయవాడ, ఛత్తీస్‌ఘడ్ 30వ నంబరు జాతీయ రహదారిపై జి.కొండూరు మండల పరిధి కట్టుబడిపాలెం, ఇబ్రహీంపట్నం మండల పరిధి కొండపల్లి ఐడీఏ వద్ద దశాబ్దాలుగా ఉన్న ఈ పార్కింగ్ సమస్యకు ఇప్పట్లో తెరపడేలా లేదు.

తండ్రి కళ్లెదుటే కొడుకు మృతి

కట్టుబడిపాలెం గ్రామం వద్ద గత సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఆయిల్ ట్యాంకర్ లారీ షడన్‌గా యూటర్న్ తీసుకోవడంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న నందిగామకు చెందిన తమ్మిశెట్టి నర్సింహారావు, ఆయన కుమారుడు రవి ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లారీ టైరు కింద పడిన రవి మృతి చెందాడు. తండ్రి నర్సింహారావుకు గాయాలయ్యాయి. ఆయిల్ ట్యాంకర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే తన కొడుకు మృతి చెందాడని నర్సింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడి రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన లారీలు కావడంతో గాయాలపాలైన వాహన చోదకులు కేసులు కూడా పెట్టకుండా వదిలేస్తున్నారు.

మార్జిన్‌లపైనే వందలాది లారీలు

కట్టుబడిపాలెం, కొండపల్లి ఐడీఏలో ఉన్న బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ కంపెనీలకు చెందిన 600 వరకు ట్యాంకర్లు, లారీలు విజయవాడ, ఛత్తీస్‌ఘడ్ 30వ నంబరు జాతీయ రహదారిపైన గంటల కొద్ది నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని కంపెనీలకు పార్కింగ్ స్థలాలు లేకపోవడం, కొన్ని కంపెనీలకు పార్కింగ్ స్థలాలు ఉన్నప్పటికీ డ్రైవర్‌లు లారీలను రహదారిపైనే నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సైతం తమ ద్విచక్ర వాహనాలను జాతీయ రహదారి మార్జిన్లలోనే పార్కింగ్ చేస్తున్నారు.

ఆందోళనలో స్థానికులు

ఆయిల్, గ్యాస్ కంపెనీలకు చెందిన లారీలు జాతీయ రహదారి మార్జిన్లలో పార్కింగ్ చేయడం వల్ల పక్కనే ఉన్న కట్టుబడిపాలెం, విద్యానగరం, ఎన్టీఆర్ కాలనీకి చెందిన ప్రజలు రోడ్డుపైకి రావాలంటే భయపడుతున్నారు. ఈ కాలనీలకు చెందిన విద్యార్థులు తరచూ ఆయా పాఠశాలు, కళాశాలల నుంచి వచ్చే వాహనాల కోసం జాతీయ రహదారిపైన వేచి ఉంటారు. ఏక్షణం ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పోలీసులు వాహనాల యజమానులు, డ్రైవర్‌లకు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చి, జరిమానాలు విధించినప్పటికీ మరలా అదే తీరు కొనసాగుతోంది. ఆయా కంపెనీల అధికారులైతే పోలీసుల హెచ్చరికలను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోవడం లేదు.

డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తాం



ఆయిల్, గ్యాస్ కంపెనీల వద్ద జాతీయ రహదారిపై పార్కింగ్ గతంలో కంటే తగ్గింది. ర్యాష్ డ్రైవింగ్, యూటర్న్‌ల వల్ల ప్రమాదాలు జరగకుండా డ్రైవర్‌లకు, లారీల యజమానులకు త్వరలో కౌన్సిలింగ్ ఇస్తాం. కంపెనీల అధికారులతో సమావేశం నిర్వహించి రహదారి మార్జిన్‌లో పార్కింగ్ చేయకుండా పార్కింగ్ స్థలాలు త్వరతిగతిన ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం.

–సతీష్‌కుమార్, జి.కొండూరు ఎస్‌ఐ

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో చేసిన తీర్మానాలలో పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం శాఖల వారీగా అధికారులు తమ శాఖలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, సమస్యలను వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు, పైపులైన్ల మరమ్మతులు, చేతి పంపుల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఎటువంటి సాయం అందించేందుకైనా తాను సిద్ధంగా ఉంటానన్నారు. ఉపాధి కూలీలు కూడా వడదెబ్బ భారిన పడకుండా పని వేళల్లో మార్పులు చేయాలని సూచించారు. కూలీలకు అవసరమైన తాగునీరు, టెంట్లు, మందులు పని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణనాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

మైలవరం: ప్రయాణికుల దాహార్తి తీర్చడం అభినందనీయమని ప్రవాస భారతీయులు, పూర్వ విద్యార్థులు అయిలూరి రాజారెడ్డి, లకిరెడ్డి చిన్నపుల్లారెడ్డి అన్నారు. వెల్వడం గ్రామ ప్రధాన కూడలి, డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కచేరీ చావడి వద్ద మంచినీటి చలివేంద్రాలను గురువారం ప్రారంభించారు. సంఘం ప్రతినిధి గూడూరు నాగిరెడ్డి, గ్రామపెద్దలు లకిరెడ్డి చిన్న పుల్లారెడ్డి, యరమల నరసింహారెడ్డి, తోట తిరుపతిరావు, కుడుముల హనిమిరెడ్డి, వేముల సూరయ్య, ఆనం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

తిరువూరు: వాసవీ క్లబ్ సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తోందని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ చిత్తలూరి నాగలక్ష్మి అన్నారు. స్థానిక జంట సినిమాహాల్స్ సెంటర్లో గురువారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని ధర్నా

విస్సన్నపేట: విద్యా సంస్థలు, నివాసిత ప్రాంతాల్లో మద్యం దుకాణాలు వద్దంటూ విస్సన్నపేటలో గురువారం మహిళలు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. విస్సన్నపేట ఎ.కొండూరు రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ఎదుట జరిగిన ధర్నాకు సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు నాయకత్వం వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వైన్‌షాపును తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు రామకృష్ణ, సీఐటీయూ, మహిళా సంఘాల నాయకులు శ్రీనివాసరావు, రంగరాణి తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రత ఆరోగ్యానికి భద్రత



నూజివీడు: నోటిని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకుంటే రోగాలు దూరమైనట్లేనని, శారీరక ఆరోగ్యానికి నోరు పరిశుభ్రంగా ఉండటం ఎంతో ముఖ్యమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం నోటి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరేంద్రసింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. ధూమపానం, మద్యపానం అలవాట్లు ఉంటే మానుకోవాలన్నారు. దంత వైద్యులు దినేష్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ సంతోషకరమైన నోరు, సంతోషకరమైన మనస్సు అనే థీమ్‌ను తీసుకుందన్నారు. కాల్షియం అధికంగా ఉండే చీజ్, పెరుగు లాంటి ఆహారం దంత ఆరోగ్యానికి మంచిదని, ఆపిల్, ఆకుకూరలు, బాదం గింజలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5.71 లక్షలకు ఆశీల వేలం ఖరారు

నూజివీడు: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో 2025 ఏప్రిల్ 25 నుంచి 2026 మార్చి 26 వరకు ఆశీలు వసూలు చేసుకునేందుకు పాటదారుడికి గురువారం ఆశీలు ఖరారు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశీల వేలంలో పట్టణానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు రూ.5,71,500లకు పాడాడు. ఇదే అత్యధికం కావడంతో కమిషనర్ ఆశీలు వసూలు చేసుకునే కాంట్రాక్టును వెంకటేశ్వరరావుకు ఖరారు చేశారు.

భూముల సమగ్ర సర్వేతో రైతులకు ప్రయోజనం

తిరువూరు ఆర్డీఓ మాధురి



అట్లప్రగడలో రీసర్వే గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ

తిరువూరు: భూముల సమగ్ర రీ సర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి అన్నారు. ఎ. కొండూరు మండలం అట్లప్రగడలో గురువారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో అభ్యంతరాలు స్వీకరించడానికి, పొరపాట్లు సరిచేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రైతులు తమ భూముల వివరాలు సరిచూసుకోవాలని చెప్పారు. అనంతరం రీ సర్వేపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ త్రివిక్రమరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు. కంభంపాడులో నివాస గృహాల వివరాల సేకరణకు చేపట్టిన స్వామిత్వ సర్వే తీరును ఆర్డీఓ పరిశీలించారు.

కొండపల్లిలో పందుల స్వైర విహారం



కొండపల్లిలో సంచరిస్తున్న పందులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. నివాస ప్రాంతాలకు సమీపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతూ పరిసరాల అపరిశుభ్రతకు కారణమవుతున్నాయి. మున్సిపాల్టీ చెత్తకుండీల్లో పడేసిన ఆహార పదార్థాల కోసం వచ్చే పందులు సమీపంలోని ఇళ్లల్లోకి చొరబడి ఇంటి ఆవరణలో ఉన్న పెరటి మొక్కలను నాశనం చేస్తున్నాయి. ప్రధానంగా మునసబు గారి సెంటర్‌లో రోడ్లపై తిరుగుతుండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పందుల సంచారంతో వ్యాధులు ప్రబలుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పందుల పెంపకందారులకు రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉండటంతోనే ఎవరినీ లెక్కచేయడం లేదన్నారు. అధికారులు స్పందించి పందులను నివాసిత ప్రాంతాలకు దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి కూలీల మస్తర్లు తనిఖీ చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్

నూజివీడు: మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయా గ్రామాల్లో వారానికోసారి పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసులు వెళ్లి తప్పనిసరిగా కూలీల మస్తర్లను తనిఖీ చేయాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ ఆదేశించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండలంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ సిబ్బంది, ఏపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికి వచ్చిన కూలీలకు మాత్రమే మస్తర్లు వేయాలని, రానివారికి మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కొలతల విషయంలో పారదర్శకంగా ఉండాలన్నారు. మండలంలో 450 నీటి కుంటలను తవ్వించేందుకు లక్ష్యం నిర్దేశించామన్నారు. ఏపీఓ శ్యాం, సిబ్బంది పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

చాట్రాయి: ఉపాధి కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం డిమాండ్ చేశారు. చిన్నంపేట గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు వారాల నుంచి కూలీలకు వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. వారం వారం పే స్లిప్పులు ఇవ్వాలని మెడికల్ కిట్లు పని ప్రదేశంలో ఉండాలని, 200 రోజుల పని దినాలు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థిక సాయం పెంపు

ఆగిరిపల్లి: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణ లబ్ధిదారులైన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోందని హౌసింగ్ ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 898 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ గృహాల లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు.

24న కిసాన్ మేళా

నూజివీడు: పట్టణంలోని మామిడి పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24న పట్టణంలో కిసాన్ మేళా నిర్వహిస్తామని మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనక మహాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూజివీడు పట్టణం విజయవాడ రోడ్డులోని నాగేంద్రరావు వరలక్ష్మి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు కిసాన్ మేళా ప్రారంభమవుతుందన్నారు. మామిడిలో ఎగుమతి అవకాశాలను బలోపేతం చేయడానికి ఆచరించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ



మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు: విద్యార్థులు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాలని 15వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎ.నాగశైలజ పేర్కొన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహంలో గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలికలు, మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, పిల్లల సంరక్షణ చట్టం, పిల్లల అక్రమ రవాణా నిరోధక చట్టం, గృహ హింస నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం, పోక్సో చట్టం తదితర చట్టాలు ఉన్నాయని వివరించారు. వీటిపై బాలికలతో పాటు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది నందూరి పద్మాంజలి, హాస్టల్ వార్డెన్లు కె.ఉషారాణి, ఎం.వెంకటరమణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

మైలవరం: ఆరోగ్యకరమైన సమాజం కోసం పోషకాహారం చాలా ముఖ్యమని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఆధ్వర్యంలో పోషణ మేళాను గురువారం నిర్వహించారు. ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రతినిధి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

మద్యం షాపు కోసం మందుబాబు నిరసన

మైలవరం: పుల్లూరులో మద్యం షాపు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ పరిధిలోని దాసుళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపై రాళ్లు పెట్టి గురువారం మధ్యాహ్నం నిరసన తెలిపాడు. దీనితో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

మైలవరం: ప్రభుత్వ అనుమతి లేని నిర్మాణాలను వెంటనే తొలగించాలని తహసీల్దార్ అబ్దుల్ దరియా అన్నారు. మైలవరం పొందుగల రోడ్డులోని కాలువ కట్టను కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని అందిన ఫిర్యాదుల మేరకు గురువారం ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని సర్వే చేయించారు. ఈ సర్వేలో కొంత కాలువ కట్ట స్థలం ఆక్రమణకు గురైనట్లు గమనించి రెవెన్యూ సిబ్బందితో గుర్తులు పెట్టించారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాలకు అర్హులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని తిరువూరు ఆర్డీఓ మాధురి కోరారు. రెడ్డిగూడెం, ఎ.కొండూరు, గంపలగూడెంలో ఉన్న కేజీబీవీలలో 7,8,9,10,12 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్లో వచ్చిన దరఖాస్తులు మాత్రమే అంగీకరిస్తారని, దరఖాస్తులకు ఏప్రిల్ 11 చివరి తేదీగా నిర్ణయించారని చెప్పారు.

సారా విక్రేత అరెస్ట్

ముసునూరు: ముసునూరులో కుప్పాల మంగమ్మ సారా విక్రయిస్తుండటంతో గురువారం ఆమె ఇంటి వద్ద సోదాలు చేసి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేస్తున్న నూజివీడు మండలం ఓగిరాల తండాకు చెందిన బాణావత్ స్వామిపై కూడా కేసు నమోదు చేశారు. దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

ఆగిరిపల్లి: మహిళల భద్రత కోసం శక్తి యాప్ ప్రత్యేకంగా రూపొందించబడిందని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. గురువారం ఆగిరిపల్లిలో స్థానిక స్టేట్ బ్యాంకు, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద మహిళల మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అత్యవసర సమయంలో మహిళలు, బాలికలు శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, మహిళా పోలీస్ వనజ పాల్గొన్నారు.

సారా నిర్మూలనపై గ్రామాల్లో ప్రచారం

చాట్రాయి: సారాను పూర్తిగా నిర్మూలిద్దామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు పిలుపునిచ్చారు. గురువారం చిత్తపూరు, జనార్ధనవరం, తుమ్మగూడెం, సోమవరం గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సారా అమ్మినా, తయారు చేసినా ఎక్సైజ్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లిస్తే రాయితీ

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని కమిషనర్ లోవరాజు ఒక ప్రకటనలో కోరారు. పాత బకాయిలు, ప్రస్తుత ఏడాది పన్నులు ఈ నెల 31లోగా చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేసే అవకాశం ప్రభుత్వం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దంత ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: ప్రపంచ దంత ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిమ్రా దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో సీఐ చంద్రశేఖర్ గురువారం ర్యాలీ ప్రారంభించారు. నోటి ఆరోగ్యంపై ప్లకార్డులు ప్రదర్శించారు. పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్, కళాశాల ప్రిన్సిపాల్ సాహిత్యరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లమందల తండాలో సారా స్వాధీనం

తిరువూరు: ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాలో గురువారం ఎక్సైజ్ అధికారులు సారా తయారీ కేంద్రంపై దాడి చేశారు. గ్రామానికి చెందిన భూక్యా పటియా వద్ద రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 50 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని సీఐ శ్రీనివాస్ తెలిపారు.